పరిమితికి మించి ప్రయాణం

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- ఆటోల్లో ప్రమాదకరంగా వెళ్తున్న మహిళా కూలీలు
- పట్టించుకోని అధికారులు


ఎలిగేడులో ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న మహిళా కూలీలు

ఎలిగేడు: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ బావులను ఆధారం చేసుకొని వరి నాట్లు వేస్తుండటం, పత్తిలో కలుపు మొక్కలను తీయిస్తుండటంతో మహిళా కూలీల కొరత ఏర్పడింది. దీంతో మహిళా కూలీలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. మండలంలోని పలు గ్రామాల రైతులు వివిధ ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా కూలీలను ఆటోలు, ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా పరిమితికి మించి అతివేగంతో తీసుకెళ్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ప్రమాదమని తెలిసి..

గ్రామీణ ప్రాంతాల్లోని ఏడు సీట్ల ఆటోలు ఎక్కువగా ఉంటాయి. ఆర్టీసీ బస్సులు ఎక్కువ సంఖ్యలో లేక.. సమయానుకూలంగా రాక ప్రజలు ఆటోలపైనే ఆధారపడుతున్నారు. బస్సు సౌకర్యం లేని గ్రామాలు సైతం ఉండటంతోపాటు ఆర్టీసీ బస్సులు నడుస్తున్న గ్రామాలకు రెండు లేదా మూడు ట్రిప్పులను మాత్రమే నడిపిస్తుండటం సహజం. గ్రామీణ ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ప్రధానంగా ఎలిగేడు, జూలపల్లి, సుల్తానాబాద్ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానికంగా కూలీల కొరత ఏర్పడటంతో.. వివిధ ప్రాంతాల నుంచి కూలీలకు ఎక్కువ కూలి చెల్లించి ఆటోల్లో తరలిస్తున్నారు. రూ.500 వరకు కూలీలకు చెల్లిస్తూ ఆటో కిరాయిలను రైతులే భరిస్తున్నారు. ఒక్కో ఆటోలో 15 నుంచి 20 మంది వరకు, ట్రాక్టర్‌లో 50 నుంచి 60కి పైగా కూలీలను తీసుకెళ్తున్నారు. పంట పొలాల్లోకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సరిగా లేక గుంతలుగుంతలుగా ఉండి ప్రమాదకరంగా మారినా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు బేఖాతరు

ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పలువురు డ్రైవర్లకు లైసెన్సులు లేకపోవడం గమనార్హం. ఎటువంటి శిక్షణ లేకుండానే ఆటోలు నడుపుతున్నారు. ఆటో డ్రైవర్ పక్కన రెండువైపులా ఇద్దరు చొప్పున నలుగురు కూర్చుంటారు. ఆటోను ఎటువైపు తిప్పాలన్నా డ్రైవర్‌కు ఇబ్బంది కలుగుతోంది. ముందు వెళ్తున్న వాహనాన్ని దాటాలన్నా, వెనక నుంచి వస్తున్న వాహనానికి దారి ఇవ్వాలన్నా కష్టమవుతోంది. ఆటో లోపలి సీట్లో దాదాపు 10 మంది వరకు, ఆటో వెనక భాగంలో నలుగురిని కూర్చోబెడుతున్నారు. వెనక నుంచి వచ్చే వాహనాలను డ్రైవర్ గమనించే పరిస్థితి లేక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ప్రమాదం జరిగినప్పుడే హడావుడి

ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు పోలీసులు, ఆర్టీఏ అధికారులు దాడులు చేస్తూ నాలుగైదు రోజులపాటు హడావుడి చేయడం సర్వసాధారణమైంది. అనంతరం అధికారులు పట్టించుకోకపోవడంతో ఆటో డ్రైవర్లు యథావిధిగా అధిక సంఖ్యలో ప్రయాణికులను తీసుకెళ్తున్నారు.

చర్యలు చేపట్టాలి



ఆటోలు, ట్రాలీ ఆటోల్లో పరిమితికి మించి కూలీలు, ప్రయాణికులను తరలిస్తున్నారు. అలాంటి ఆటోలను గుర్తించి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలె. అట్లయితేనే ప్రమాదాలు తగ్గుతయ్.

– భూసారపు భాస్కర్‌గౌడ్, ధూళికట్ట గ్రామస్తుడు

కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమం


ప్రకాశ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తోందని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి అన్నారు. చైర్మన్‌గా పదవీ బాధ్యతలను చేపట్టిన తర్వాత తొలిసారిగా వచ్చిన ప్రకాశ్‌రెడ్డికి పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు స్వాగతం పలికి సత్కరించారు. మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ పటిష్టానికి పాటుపడతానన్నారు. నాయకులు సునీల్‌గౌడ్, కొండి సతీశ్, సంపత్, సుభాష్‌రావు, జగదీశ్, అభిలాష్, తిరుపతి, నల్లగొండ కుమార్, నదీం, భాస్కర్, తూముల శ్రీనివాస్ తదితరులున్నారు.

సుల్తానాబాద్: రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డికి సుల్తానాబాద్‌లో ఘన స్వాగతం పలికారు. మంచిర్యాల జిల్లాకు వెళ్తున్న సందర్భంగా సుల్తానాబాద్‌లో సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐకమత్యంగా ముందుకు సాగాలి


రాజకుమార్‌తో సుల్తానాబాద్ పద్మశాలీ సంఘం నాయకులు

సుల్తానాబాద్: పద్మశాలీలు ఐకమత్యంగా ముందుకెళ్లాలని యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు యాదగిరి అన్నారు. సోమవారం రాష్ట్ర పద్మశాలీ సంఘం ఎన్నికలకు రాష్ట్ర అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న రాజకుమార్‌కు మద్దతుగా సుల్తానాబాద్ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వల్లకాటి రాజకుమార్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఆయనకు మద్దతుగా యాదగిరి ఆధ్వర్యంలో జిల్లా సంఘం నాయకులు హైదరాబాద్ వెళ్లారు. సామల రాజేంద్రప్రసాద్, దూడం ఆంజనేయులు, అడిచెర్ల స్వతంత్ర్యకుమార్, చిలువేరు సంపత్, మోర మనోహర్, వేముల చిరంజీవి పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


హమాలీలకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సుల్తానాబాద్: హమాలీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులను ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మట్ట శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అందజేశారు. రమేశ్, శ్రీను, రాజు, చంద్రయ్య, అంజయ్య, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందే కేసీఆర్


మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జరిగిందంటే కేవలం తొలి సీఎం కేసీఆర్ చేసిందే తప్పా.. ప్రస్తుత ప్రభుత్వం చేసింది శూన్యమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం ఖని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 7నెలలు గడుస్తున్నా రామగుండంలో అభివృద్ధి కనిపించడం లేదని ప్రశ్నించారు. రామగుండంలో నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించాలని, లేదంటే రామగుండం కార్పొరేషన్ ముట్టడిస్తామన్నారు.

బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


జ్యోతినగర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: సింగరేణి సంస్థ పరిరక్షణకు, వేలంపాట నిలిపివేయాలని, బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. కార్యదర్శి ఎం.రామాచారి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనులను వేలానికి పెట్టి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ చేపట్టిన సింగరేణి పరిరక్షణ యాత్ర ఈనెల 30న గోదావరిఖనికి చేరుకుంటుందని, 31న సాయంత్రం ఐదు గంటలకు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాంసాని శంకర్, మల్లేశ్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: తెలంగాణలోని బొగ్గు బ్లాకులు సింగరేణి సంస్థకే కేటాయించాలని, సింగరేణి పరిరక్షణకు ఈనెల 29 నుంచి ఆగస్టు 5 వరకు చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎరవేల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. సోమవారం సెంటనరీకాలనీలోని కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యుడు దొమ్మటి కొంరయ్య, నాయకులు కుమార్, హమీద్ పాషా, రమణారెడ్డి, వేణుగోపాల్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంథని: తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని, కేంద్రంలోని బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి ఆగస్టు 5 వరకు చేపట్టే సింగరేణి పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ కోరారు. సోమవారం మంథని అంబేడ్కర్ చౌరస్తాలో సింగరేణి పరిరక్షణ యాత్ర వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు ఆర్ల సందీప్, సురేష్, మౌర్య, బావు రవి, తాతారావు తదితరులున్నారు.

బొగ్గు గనుల వేలాన్ని ఆపాలి

జూలపల్లి: తెలంగాణలో బొగ్గుల గనుల వేలాన్ని బీజేపీ ప్రభుత్వం ఆపాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధి, కరెంటు ఉత్పత్తి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తోడ్పడుతున్న సింగరేణిని వేలం వేయడం దారుణమన్నారు. నాయకులు సంపత్, బానయ్య, నాగయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న వెంకటయ్య, మనోహర్‌రెడ్డి

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్ ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమకారుడు తాటిపెల్లి రాజలింగం పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. రాజలింగంను సన్మానించారు. పాట్యాల మల్లేశం, వజ్రారెడ్డి, కొడూరి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థిక చేయూత


ఆర్థిక సాయం అందజేసిన సేవాసమితి సభ్యులు

కోల్‌సిటీ: గోదావరిఖని గంగానగర్‌కు చెందిన జిల్లపల్లి విజయ్ అనే నిరుపేద పేషెంట్‌కు సోమవారం శ్రీసీతారామ సేవాసమితి సభ్యులు రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇంటి పైకప్పు నుంచి జారి కిందపడిన విజయ్‌కి కాళ్లు, చేతులు విరిగి మంచానికి పరిమితమయ్యాడు. అతడి తండ్రి భీమయ్య కూడా రెండేళ్లుగా పక్షవాతంతో మంచంలోనే ఉంటున్నాడు. విజయ్‌పైనే భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి, తండ్రి ఆధారపడి ఉన్నారు. విషయం తెలుసుకున్న శ్రీసీతారామ సేవాసమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ స్పందించారు. దాతలు ముందుకు రావాలని కోరడంతో.. ప్రైవేట్ టీచర్ శశికళ రూ.2,000, కార్తీక్ రూ.2,000 చంద్రమౌళి రూ.వెయ్యి చొప్పున అందించారు.

మిత్రుడి కుటుంబానికి..

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన బ్రహ్మోజు వెంకటేశ్వర్లు గత నెలలో అనారోగ్యంతో మృతిచెందగా.. మృతుడి కుటుంబానికి 1986–87 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయమందించారు. సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అతడి భార్య వెంకటలక్ష్మి, కుమారులకు రూ.44,500 అందజేశారు. తాటిపల్లి భాస్కర్, గ్యాజంగి భూపతి, కట్ల రాజమౌళి, గాలిపల్లి వెంకటేశ్వర్లు, గోసిక శ్రీనివాస్, నర్సింగం, అడ్డగుంట తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని నూకాంబిక పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని సోమవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

బీసీ కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించండి

మంథని: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో వరంగల్ బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన మాట ప్రకారం బీసీ కుల గణన చేసి రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తరగం శంకర్‌లాల్ కోరారు. సోమవారం మంథనిలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, ఎంపీటీసీల సంఘం మాజీ అధ్యక్షుడు పెగడ శ్రీనివాస్, బీసీ సంఘం నాయకుడు సమ్మయ్య తదితరులున్నారు.

చార్జింగ్ లైట్లు, పండ్లు పంపిణీ

రామగిరి: సింగరేణి సీఅండ్‌ఎండీ బలరాంనాయక్ జన్మదిన వేడుకలు సోమవారం ఏపీఏ కార్మికుల ఆధ్వర్యంలో సెంటనరీకాలనీ కస్తూర్బా బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు పిల్లలకు పండ్లు, చార్జింగ్ లైట్లు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఏపీఏ కార్మికులు ఇంద్రసేనారెడ్డి, మెడగాని వెంకటేశ్, బండి విశ్వాస్, కాసు అనిల్‌కుమార్, ప్రేమ్‌కుమార్, విష్ణు, ప్రశాంత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా సూపర్‌వైజర్ల జోన్ల మార్పు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని శానిటేషన్ విభాగంపై జిల్లా కలెక్టర్ చేపట్టిన ప్రక్షాళనలో భాగంగా సోమవారం శానిటేషన్ సూపర్‌వైజర్ల జోన్లు మార్చుతూ బల్దియా కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. 50 డివిజన్లను 12 జోన్లుగా విభజించిన అధికారులు.. ఒక్కో జోన్‌కు డివిజన్లు కేటాయించారు. 1వ జోన్‌లోని 1, 20, 21, 22 డివిజన్లకు ఎం.తిరుపతి, 2వ జోన్‌లోని 24, 2, 3, 4, 23 డివిజన్లకు వి.సంపత్, 3వ జోన్‌లోని 5, 7, 9, 25 డివిజన్లకు ఆర్.సారయ్య, 4వ జోన్‌లోని 6, 8, 28, 29 డివిజన్లకు బండారి రవి, 5వ జోన్‌లోని 10, 27, 30, 41 డివిజన్లకు ఎండీ ఈసుబ్, 6వ జోన్‌లోని 31, 40, 49, 50 డివిజన్లకు ఎస్.దయానంద్, 7వ జోన్‌లోని 32, 42, 43, 48 డివిజన్లకు వి.అశోక్, 8వ జోన్‌లోని 26, 38, 39, 47 డివిజన్లకు జి.ఉమామహేశ్వర్, 9వ జోన్‌లోని 37, 44, 45, 46 డివిజన్లకు ఎ.శ్రీనివాస్, 10వ జోన్‌లోని 33, 34, 35, 36 డివిజన్లకు వెంకటస్వామి, 11వ జోన్‌లోని 11, 12, 13, 14 డివిజన్లకు ఎ.సోమేశ్, 12వ జోన్‌లోని 15, 16, 17, 18, 19 డివిజన్లకు బి.రాజబాబు, వెహికిల్స్ ఇన్‌చార్జిగా సీహెచ్ సుగుణాకర్‌రెడ్డి బాధ్యతలు నిర్వహించనున్నారు. అయితే ఇందులో తిరుపతి, సంపత్, దయానంద్‌కు మాత్రం పాత జోన్లనే కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. జోన్లు మార్చిన మిగతా సూపర్‌వైజర్లలో అసంతృప్తి నెలకొంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ట్రినిటీ డిగ్రీ కళాశాల 2006–09 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అధ్యాపకులకు సన్మానించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు, డ్రైవర్లు

గోదావరిఖనిటౌన్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆటో డ్రైవర్ల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధికార ప్రతినిధి దార మధు, ఉపాధ్యక్షుడు మాతంగి శివరాజ్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. రవి, రాజయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్లు చోరీ

సుల్తానాబాద్ రూరల్: కాట్నపల్లిలో రూ.50వేల విలువ చేసే 20 నాటుకోళ్లు చోరీకి గురైనట్లు బాధితుడు సతీశ్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 27న గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

'బీఆర్‌ఎస్ ఆరోపణలు సరికాదు'

ధర్మారం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మాణం చేసిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని నందిపంప్ హౌస్ నుంచి పంపింగ్ చేస్తున్నారని, కాళేశ్వరం నీటిని తరలిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. నందిమేడారం పంప్‌హౌస్ వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు జనగామ లక్ష్మి, కాడే సూర్యనారాయణ, దేవి జనార్దన్ మాట్లాడారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మేడారం నందిపంప్ హౌస్‌కు, గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్‌మానేరుకు నీటిని తరలిస్తుంటే బీఆర్‌ఎస్ అసత్యపు ప్రచారాలు చేస్తోందన్నారు. నాయకులు కాంపెల్లి రాజేశం, లింగయ్యగౌడ్, వోడ్నాల శంకరయ్య, కరేటి వేణుమాధవ్, ఉత్తెం రాజయ్య, పోలవేని స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దివ్యదర్శన్‌రావు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావును ఎంపీడీవోల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్నుకున్నట్లు జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధిక్ పాషా తెలిపారు.

ఆటో అడ్డా అధ్యక్షుడి ఎన్నిక

గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీవిష్ణురాజు ఆటో యూనియన్ బస్టాండ్ అడ్డాకు సంబంధించిన నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నిక స్థానిక గంగానగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. అధ్యక్షుడిగా ఆసంపెల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఈర్ల సారయ్య ఎన్నికయ్యారు.

పాఠశాల రోడ్డును బాగు చేయండి

పెద్దపల్లిరూరల్: చీకురాయి గ్రామంలోని ప్రభుత్వోన్నత పాఠశాలకు వెళ్లేందుకు దారి సరిగా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష అన్నారు. చీకురాయిలోని పాఠశాల రోడ్డును స్థానికులతో కలిసి పరిశీలించారు. వాన కురిస్తే అడుగు తీసి అడుగేయలేని పరిస్థితి ఉందన్నారు. అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు భిక్షపతి, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రావణ్, రాజు, సదయ్య, ప్రేమ్‌కుమార్, నవీన్, భాస్కర్, బన్నీ, వినయ్, రాము తదితరులున్నారు.

'మత్స్య కార్మికులను విస్మరించిన ప్రభుత్వం'

కమాన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో మత్స్యకార సంఘాలకు నిధులు కేటాయించక విస్మరించిందని మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ తాళ్ల తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రవి, చొప్పరి తిరుపతి, శ్రావణ్, కొండిల్ల సతీశ్, చొప్పరి సతీశ్, తాళ్ల రాజేశ్, కనకయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

సుల్తానాబాద్ రూరల్: గర్రెపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సిరిశెట్టి ప్రశాంత్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం గ్రామస్తులు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ప్రత్యేకాధికారి దివ్యదర్శన్‌రావు, నూతన కార్యదర్శి లచ్చయ్య, మాజీ సర్పంచ్ వీరగోని సుజాత, నాయకులు రమేశ్‌గౌడ్, అనూష, మధుకర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీధర్, ఏఎస్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, కారోబార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో నూతనంగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. జూన్ 28 వరకు పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన 389 రైతులు ఆగస్టు 5 లోపు రైతు ఆధార్, నామిని ఆధార్, రైతు పట్టాదారు పాసు పుస్తకం జత చేసి ఇవ్వాలన్నారు. గతంలో బీమా పొందిన రైతులు మార్పులు, చేర్పుల కోసం ఈనెల 30 లోపు అవకాశముందని వివరించారు.

పారిశుధ్య కార్మికులకు రక్షణ సామగ్రి పంపిణీ


రక్షణ సామగ్రి అందజేస్తున్న సోమేష్

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ పరిధిలో నిత్యం విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఆదేశాల మేరకు సోమవారం శానిటర్ సూపర్‌వైజర్ ఆడప సోమేష్ రక్షణ సామగ్రి అందజేశారు. సోమేష్ మాట్లాడుతూ.. యూనిఫాంతోపాటు చేతులకు గ్లౌజులు ధరించి పనులు చేయాలని సూచించారు.

పిచ్చి మొక్కల తొలగింపు


పనులు పరిశీలిస్తున్న కందుల సంధ్యారాణి

రామగుండం: రామగుండం పట్టణం నుంచి లింగాపూర్ గ్రామ శివారు వరకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను సోమవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి తన సొంత ఖర్చులతో జేసీబీ సహాయంతో తొలగించారు.

మొక్కలు పంపిణీ


మొక్కలు అందజేస్తున్న అభయ ట్రస్టు సభ్యులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీఆదివరహస్వామి ఆలయంలో అభయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు సోమవారం వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. ట్రస్టు చైర్‌పర్సన్ వెల్ది కవిత, అనంతరాములు, హర్షవర్ధన్, అనిల, రామిళ్ల సతీశ్, వెంకన్న పాల్గొన్నారు.

బాలుడి మృతిపై విచారణ

కాల్వశ్రీరాంపూర్: జాఫర్‌ఖాన్‌పేటలో విష జ్వరంతో సాయిసాత్విక్ అనే బాలుడు(మల్యాల మోడల్ స్కూల్ విద్యార్థి) ఆదివారం రాత్రి మృతిచెందగా.. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్ సోమవారం జాఫర్‌ఖాన్‌పేటలో విచారణ నిర్వహించారు. సాత్విక్‌కు స్థానిక ఆర్‌ఎంపీ వైద్యం అందించిన విషయమై కుటుంబ సభ్యులను వివరాలు కోరినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఆర్‌ఎంపీ గ్రామంలో వైద్యం చేయొద్దని గతంలో హెచ్చరించామని కూనారం పీహెచ్‌సీ డాక్టర్ భావన తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఓదెల: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన మహిళ దహన సంస్కారాలకు మానవత్వంతో కాలనీవాసులు ముందుకు రాగా.. సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి రూ.26వేలను కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. గోపరపల్లె గ్రామంలోని రెడ్డికాలనీకి చెందిన మడుపు శారద(40) అనే మహిళ అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. వండ్రంగి పని చేసే శ్రీనివాస్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. మృతురాలి అంత్యక్రియలకు డబ్బుల్లేవని కాలనీవాసులకు తెలిసింది. సింగిల్‌విండో మాజీ చైర్మన్ నారాయణరెడ్డి కాలనీవాసులతో మాట్లాడి రూ.26వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

కార్మిక సంఘం చర్చలు సఫలం

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో భాగంగా కంపెనీ అధికారులతో జరిగిన చర్చలు సఫలీకృతమయినట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. సోమవారం కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్ ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథితో కంపెనీలో కార్మికుల డిమాండ్ చార్టర్‌పై చర్చించారు. అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ప్రసాద్, నారాయణ, శ్రీనివాస్, మోహన్, దశరథం, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాకేశ్ - 9676603963
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899